# సురక్షిత అంతర్జాల వినియోగానికై పాఠశాల విద్యార్థులు పాటించాల్సిన నియమాలు

## (Cyber Safety Measures in Schools)

యూనిట్-1: అంతర్జాల వినియోగం - ప్రస్తుత పరిస్థితులు

యూనిట్-2: సురక్షిత అంతర్జాల వినియోగానికై పాటించాల్సిన నియమాలు

యూనిట్-3: సైబర్ నేరాల నుండి సురక్షిత, భద్రత - పాఠశాల పాత్ర


**రచయిత**

ఇ.డి. మధుసూధన్ రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) & ఎస్.ఆర్.జి.,

జి.ప.ఉ.పా., బాహార్ పేట, కోస్గి,

నారాయణపేట జిల్లా.

**ఎడిటింగ్**

డా. ఎస్. సురేష్ బాబు, కన్సల్టెంట్, స్కూల్ లీడర్షిప్ అకాడమీ,

ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్.



స్కూల్ లీడర్షిప్ అకాడమీ

ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ,

హైదరాబాద్.

నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్షిప్,

ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NCSL-NIEPA),

న్యూఢిల్లీ.

# సురక్షిత అంతర్జాల వినియోగానికై పాటించాల్సిన నియమాలు

## పరిచయం

ప్రపంచం, ప్రపంచంతో పాటు భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో పురోగమిస్తున్నది. అవసరాల కోసం, సౌకర్యాల కోసం, నవకల్పనల కోసం, జ్ఞాన విస్తృతిలో భాగంగా నూతన ఆవిష్కరణలు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉన్నాయి. ఆది మానవుల కాలం నుండి సమాచార మార్పిడి కోసం మానవ సమూహాలు వివిధ విధానాలను అవలంబిస్తున్నాయి. ప్రస్తుత కాలంలో సమాచార మార్పిడి కోసం స్మార్ట్ ఫోన్ ఒక ముఖ్యమైన సాధనంగా ఆవిర్భవించింది. స్మార్ట్ ఫోన్, అదీ మన చేతుల్లో ఇమడగలిగే ఫోన్ రావడంతో ప్రపంచం మన గుప్పిట్లోకి చేరినట్లయ్యింది. ప్రస్తుతం అంతర్జాల సౌకర్యం గల స్మార్ట్ ఫోన్ లేనిదే సాధారణ జీవితం గడవలేని పరిస్థితి వచ్చింది.

ప్రతి ఆవిష్కరణలో మానవులకు మంచితోపాటు వినియోగించుకునే, వాడుకునే వ్యక్తుల మనస్తత్వం ఆధారంగా చెడు కూడా కలిసివస్తుంది. కాబట్టి అంతర్జాల సౌకర్యం గల ఫోన్ ఉన్న వ్యక్తులు తాము వ్యక్తిగతంగా దానిని దుర్వినియోగం చేయకపోవడం, దాని ఆధారంగా మోసాలు చేసే వారి నుండి జాగ్రత్తగా ఉండడం తప్పనిసరి. అంతర్జాల వినియోగం గల స్మార్ట్ ఫోన్ ను సురక్షితంగా వినియోగించుకోవడానికి, సైబర్ నేరాలకు గురికాకుండా ఉండడానికి సురక్షితమైన, భద్రతగల ప్రమాణాలను ప్రతి ఒక్కరు పాటించవలసి ఉంది. విద్యావంతులైన వారు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో విధాలుగా సైబర్ నేరాలకు గురవుతున్నారు. సాధారణ నేరాల కంటే సైబర్ నేరాల ద్వారా ఆర్థిక, వ్యక్తిగత అంశాలలో ఎక్కువ నష్టం జరుగుతోంది.

కోవిడ్-19 పరిస్థితి ప్రజల జీవన విధానంలో మరియు ప్రతి రంగంలో అనేక మార్పులను తీసుకువచ్చింది. శాస్త్రసాంకేతిక రంగంలో కూడా ప్రగతిదాయక అంశాలు వచ్చి చేరాయి. ఒకరిని ఒకరు కలుసుకోలేని పరిస్థితులలో అందరిని కలిపే ముఖ్య సాధనంగా మొబైల్ ఫోన్ మారింది. విద్యారంగంలో కూడా అంతర్జాలం గల ఫోన్ ఆధారంగా బోధనాభ్యసన పెరిగింది. సోషల్ మీడియా ద్వారా మరియు వివిధ యాప్ లనూ ఉపయోగించి బోధనాభ్యసన ప్రారంభమయ్యింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులలో కూడా మొబైల్ ఫోన్ వాడకం పెరిగింది.

విద్యార్థుల చేతికి స్మార్ట్ ఫోన్ రావడంతో వారికి ఒనగూరే ప్రయోజనాలతో పాటు కొన్ని నష్టాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలలు 2019-2020 నుండి విద్యార్థులు అందరూ సకల సౌకర్యాలుగల ఫోన్లను ఉపయోగిస్తూ పొందిన లాభాలను, నష్టాలను గురించి మనం చర్చిద్దాం. సురక్షిత అంతర్జాల వినియోగంపై అవగాహన కల్పించడంలో పాఠశాల, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైనది. ఈ పరిస్థితుల్లో పాఠశాల చేపట్టవలసిన సురక్షిత అభ్యసన వాతావరణాన్ని కూడా పరిశీలిద్దాం.

# యూనిట్-1: అంతర్జాల వినియోగం - ప్రస్తుత పరిస్థితులు

## అభ్యసన ఫలితాలు

1. అంతర్జాల వినియోగం ఆవశ్యకతను గుర్తిస్తారు.
2. ప్రస్తుత జీవన విధానానికి అంతర్జాల సౌకర్యంగల ఫోన్ అవసరాన్ని వివరిస్తారు.

## కీలక పదాలు

అంతర్జాలం, సమాచార మార్పిడి, ఆర్థిక లావాదేవీలు, బోధనాభ్యసన సాధనాలు.

## పరిచయం

మానవ జీవన విధానంలో సమాచార మార్పిడికి అత్యంత ప్రాధాన్యత ఉంది. మానవ వికాసానికి, పరిణామానికి ఈ సమాచార మార్పిడి ఎంతగానో తోడ్పడింది. ఆదిమానవులు సైగల ద్వారా, శబ్దాల ద్వారా, సమాచారాన్ని గ్రహించడం, వ్యక్తపరచడం చేసేవారు. క్రమానుగతంగా సమాచార మార్పిడికి ఎన్నో సాధనాలు తోడయ్యాయి. ఇందుకు రాయడం అనేది పెద్దపీట వేసింది.

పారిశ్రామిక విప్లవం అనేక సమాచార సాధనాలను మానవాళికి పరిచయం చేసింది. రేడియో, టెలివిజన్, ఫోన్ తో పాటు ముద్రణ ప్రారంభమయ్యాక పత్రికలు... ఇలా అనేక సాధనాలు ప్రపంచమంతా సమాచారాన్ని తక్కువ కాలంలో ఎక్కువగా అందించడానికి ఎంతగానో దోహదం చేశాయి. వీటన్నింటిలో కంప్యూటర్, అంతర్జాలం ఆవిష్కరణ అతి పెద్ద ముందడుగు. ఈ సౌకర్యాలన్నీ ఒక మొబైల్ ఫోన్లో నిక్షిప్తం చేసి అందించడంతో ప్రపంచ సమాచారం అంతా మానవుల గుప్పిట్లోకి చేరినట్లయ్యింది. గత దశాబ్దంలో శాస్త్ర, సాంకేతికత సాధించిన ప్రగతి వలన ప్రతి రంగంలో అనేక సౌకర్యవంతమైన మార్పులు వచ్చాయి. ప్రస్తుతం వివిధ రంగాలలో పనిచేస్తున్న వ్యక్తులతో పాటు సాధారణ ప్రజలకు కూడా ఈ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. వాస్తవంగా సాధారణ ప్రజల దైనందిన జీవితం కూడా అంతర్జాల సౌకర్యం లేని, అంతర్జాల సౌకర్యం గల ఫోన్లతో ఎంతగానో ముడిపడి ఉంది. ఫోన్ చేసి మాట్లాడడం, ముద్రిత సమాచారాన్ని పంపించడం, అందుకోవడంతో ప్రారంభమైన సమాచార మార్పిడి సౌకర్యాలు అంతర్జాల సౌకర్యంతో శిఖరాన్ని చేరుకున్నాయి. ప్రస్తుతం ఫోన్లలో అంతర్జాల సౌకర్యం అందుబాటులోకి రావడం మానవ జీవితానికి ఎంతో సౌకర్యంగా మారింది. సమాచారంతో పాటు అనేక సౌకర్యాలు మొబైల్ ఫోన్ ద్వారా అందుబాటులోకి వచ్చాయి. కాలిక్యులేటర్, గడియారం, క్యాలెండర్, కెమెరా, అయస్కాంత దిక్సూచీ, ఫైల్స్ (files), వాతావరణ వివరాలు.... ఒక్కటేమిటి సకల సౌకర్యాలు ఒక్క ఫోన్లోనే అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా సోషల్ మీడియా (WhatsApp, Facebook, Twitter, Instagram) సమాచార మార్పిడి విషయంలో కొత్త పుంతలు తొక్కింది. వీటి వల్ల సమాచారాన్ని సెకన్లలో వివిధ వ్యక్తులతో, వివిధ విధానాలలో అంటే వ్యక్తిగతంగా, సమూహాలలో, చేరవేయడం సాధ్యమవుతున్నది.

ఫోన్ ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు జరపగలగడం, కొనుగోళ్ళు, అమ్మకాలు చేయగలగడం, శాస్త్ర, సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీశాయి. మన దేశం కూడా వీటన్నింటిని అందిపుచ్చుకొని డిజిటల్ ఇండియాగా రూపాంతరం చెందుతోంది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు వివిధ రకాల చెల్లింపులు ప్రస్తుతం ఫోన్ ద్వారానే జరుగుతున్నవి. ఉదా: పన్నులు, టెలివిజన్, కరెంటు బిల్లుల చెల్లింపు మొదలగునవి. ప్రభుత్వం ప్రజలకు అందించే సౌకర్యాలకు జవాబుదారీతనంగా ఫోన్ సౌకర్యాన్ని మాధ్యమంగా ఎంచుకొన్నది. వీటి ద్వారా ప్రజలు పొందే వివిధ సౌకర్యాల లబ్ధిదారుల వివరాల సమాచారం ప్రభుత్వానికి వీటి ద్వారా వెంటనే అందుతున్నది. ప్రస్తుత సాధారణ దైనందిన జీవితం అంతర్జాల సౌకర్యం గల ఫోన్‌తో పూర్తి స్థాయిలో ముడిపడిపోయింది.

శాస్త్ర సాంకేతిక రంగంలో, సాంకేతిక పరికరాలలో ఏ మార్పులు వచ్చినను వాటిని విద్యావ్యవస్థ ఉపయోగించుకుంటూనే ఉంది.

అదేవిధంగా అంతర్జాల సౌకర్యం గల ఫోన్ల ఆవిష్కరణ పరిణామాలు సహజంగానే అన్ని రంగాలతో పాటు విద్యారంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపాయి. పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనాభ్యసన ప్రక్రియలు, అభ్యసన సామగ్రి మొత్తం ఆధునికతను సంతరించుకున్నాయి. కోవిడ్-19 సంక్షోభంలో ఈ మార్పు మరింత బలంగా, విస్తృతంగా విద్యాసంబంధ అన్ని అంశాలలో ప్రభావం చూపింది. అంతర్జాల సౌకర్యం గల ఫోన్ ద్వారా విద్యాసంబంధ సమాచారం అందుబాటులోకి వచ్చింది. కోవిడ్-19 పరిస్థితుల్లో తెలంగాణలోని చాలా పాఠశాలల్లో విద్యార్థి సమూహాలను వాట్సాప్ గ్రూపులలో ఏర్పాటు చేయడం, పాఠ్యాంశాలు విద్యార్థులకు షేర్ చేయడం, జూమ్ వంటి యాప్ ల ద్వారా తరగతులు నిర్వహించడం, గూగుల్ ఫారాల వాటి ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయిని మదింపు చేయడం వంటివి అమలు చేయడం జరిగింది. ఇదే సందర్భంలో 'దీక్ష' కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తకాలలో అందుబాటులోకి తెచ్చిన క్యు.ఆర్. కోడ్స్ కూడా విద్యార్థులు వినియోగించుకోవడం జరిగింది. ఇందుకు చాలా మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతర్జాల సౌకర్యం కలిగిన ఫోన్లు వాడడం జరిగింది. ఈ క్రమంలో ఈ సౌకర్యాలు సానుకూలతలతో పాటు కొన్ని ప్రతికూల ప్రభావాలను కూడా చూపాయి.

## సానుకూల అంశాలు

- అంతర్జాల సౌకర్యం వలన సమాచారాన్ని పొందడం చాలా సులభం అయ్యింది. చాలా సమాచారం అందుబాటులోకి వచ్చింది. సమాచార మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు సమాచారం పొందే వనరులు స్వల్పం. వనరుల కొరకు గ్రంథాలయం వంటి ప్రదేశాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండానే సమాచారం గుప్పిట్లోకి వచ్చి చేరింది.
- స్థానికతతోపాటు (local) పాటు ప్రపంచం (global) నుండి కూడా సమాచారం పొందే అవకాశం ఏర్పడింది.
- సమాచారాన్ని వేగంగా, ఎంత సమాచారం అయినా ఒకేసారి అనేక మందికి పంపించే మరియు పొందే అవకాశం ఏర్పడింది.
- కొత్త అవకాశాలు, విద్యా-ఉద్యోగ సమాచారం, ఆన్లైన్ క్విజ్ (quiz), ఆన్లైన్ పరీక్షలు, పోటీలలో పాల్గొనే అవకాశం లభించింది.

- లక్షల పుస్తకాలు, పత్రికలు, అభ్యసన సామగ్రి, పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలు, ఆడియోలు అందుబాటులోకి వచ్చాయి.
- వ్యక్తులు తమ నైపుణ్యాలను, సృజనాత్మకతను, ఇతర అంశాలను ప్రదర్శించడానికి మరియు పంచుకోవడానికి తగిన వేదిక లభించింది.
- ఒక నిర్మాణాత్మక ధోరణి, సానుకూలత, జీవితాన్ని తీర్చిదిద్దే అంశాలు అందరిపై ప్రభావాన్ని చూపాయి.
- విద్యార్థులు సొంతంగా, సృజనాత్మకంగా వివిధ అంశాలపై వివిధ రూపకాలను తయారుచేశారు. ఉదా: నెల్లూరు పిల్లలు నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానల్స్.
- విద్యా సంబంధ ఎన్నో యాప్స్ రూపొందించడం, అవి అందరికీ అందుబాటులోకి రావడం జరిగింది.

ఫలితాలు:

- పాఠశాల నుండి అందే సమాచారం కంటే తక్కువ సమయంలో, ఎక్కువ సమాచారాన్ని పొందగలగడం.
- సమాచారం అనేక మార్గాలలో అందుబాటులోకి రాగలగడం.
- దృశ్యరూపం, శబ్ద రూపంలో (Audio-Visual) కూడా సమాచారం లభ్యమవడంతో ఎక్కువ అవగాహనకు దోహదపడడం.
- అనేక భౌగోళిక ప్రదేశాలను ఉన్నచోటు నుండి సందర్శించిన అనుభూతి కలగడం.
- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశం కలగడం.
- సందేహాలు తీర్చుకొనుటకు, తమకు తెలిసిన సమాచారాన్ని అందరితో పంచుకొనుటకు సరయిన వేదిక దొరకడంతో జ్ఞానం విస్తృతం కావడం.
- స్వయం అధ్యయనానికి మార్గం ఏర్పడడం.
- సాంకేతికత వినియోగంలో, సాంకేతిక పరికరాల వినియోగంలో ముందడుగు వేయడం.
- విస్తారమైన గ్రంథాలయాలు, అభ్యసన సామగ్రి ద్వారా అభ్యసించాలనుకున్న భావనలను నేర్చుకోవడం, విస్తృతపరుచుకోవడం.
- నూతన ఆవిష్కరణలు, ప్రాజెక్టులు, నవకల్పనలు రూపొందించుటకు మార్గదర్శనం లభించడం.

## ప్రతికూల అంశాలు

- చట్టవ్యతిరేక, ప్రతికూల సమాచారం, అశ్లీల అంశాలు విరివిగా అందుబాటులోకి వచ్చాయి.
- కాపీరైట్ అంశాలను పట్టించుకోకుండా వినియోగించుకుంటున్నారు.
- సైబర్ నేరాలు ఎక్కువయ్యాయి.
- ముఖ్యంగా ఆర్థికాంశాల మరియు నగదు లావాదేవీలలో మోసాలు ఎక్కువయ్యాయి.
- ఆకర్షణీయమైన బహుమతుల పేరిట మోసాలు చేస్తున్నారు.
- పిల్లలతో పాటు పెద్దలు కూడా మొబైల్ ఫోనుకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వ్యక్తుల జీవితంపై, ప్రవర్తనపై, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.

- వెబ్‌సైట్లను, బ్యాంకు ఖాతాలను హ్యాక్ చేయడం కూడా జరుగుతోంది.
- సాహస క్రీడల పేరిట పిల్లలను ఆకర్షించి, వారికి ఎరవేసి, డబ్బులు లాగడం జరుగుతోంది.
- పిల్లలు, పెద్దలు చూడకూడని వెబ్‌సైట్ల ఆకర్షణకు లోనవుతున్నారు.
- అభ్యసనం, సమాచారం పొందడం కంటే వినోదానికి ప్రాధాన్యత ఎక్కువయ్యింది.
- సైబర్ నేరాలు పిల్లలకు ప్రమాదకరంగా పరిణమించాయి.
- అపరిచితులు తప్పుడు సమాచారమిచ్చి పరిచయం చేసుకొని మోసం చేయడం, దురలవాట్లు పరిచయం చేయడం జరుగుతోంది.
- ఎక్కువ సమయం పిల్లలు ఫోన్లో గడపడం జరుగుతున్నది.
- ఆన్‌లైన్లో పరిచయం చేసుకొని వ్యక్తిగత అంశాలను తెలుసుకొని కొన్ని తప్పుడు పనులు చేయించి వాటి ఆధారంగా బ్లాక్‌మెయిల్ చేయడం జరుగుతోంది.
- వ్యక్తులకు సంబంధించి తప్పుడు సమాచారంతో, మార్ఫింగ్ ద్వారా వివిధ అంశాలు వైరల్ చేసి పేరు ప్రఖ్యాతులను దెబ్బతీసి బాధపెడుతున్నారు. లైంగిక వేధింపులకు, నేరాలకు పాల్పడుతున్నారు.
- ఈ సైబర్ నేరాలు చేసే వారిలో పరిచయస్థులు కూడా ఉంటున్నారు.

**ఫలితాలు:**

- విద్యార్థులతో సహా పెద్దవారు కూడా ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా వ్యసనానికి గురికావడం.
- కొందరు మతిస్థిమితం కోల్పోవడం లేదా మతిమరుపుకు గురికావడం, అనారోగ్యానికి గురికావడం.
- పిల్లల సత్ప్రవర్తనపై తీవ్ర ప్రభావం పడడం, మానవ సంబంధాలు దెబ్బతినడం.
- విద్యాసంస్థలకు రెగ్యులర్‌గా హాజరు కాకపోవడం.
- చదువులలో వెనుకబడడం.
- నేరాలకు పాల్పడే మనస్తత్వం అలవడడం.
- సాహసోపేత అంశాల ప్రేరణతో దైనందిన జీవితంలో వాటిని అమలుచేసి ప్రమాదాలు కొనితెచ్చుకోవడం.
- తీవ్రమైన భావోద్వేగాలకు గురికావడం.
- ఇతరులతో మాట్లాడడం పూర్తిగా తగ్గించడం.

## సంక్షిప్త సారాంశం

మానవ జీవన పరిణామ క్రమంలో అన్ని అంశాలతోపాటు శాస్త్ర, సాంకేతికరంగం కూడా చాలా అభివృద్ధి చెందుతోంది. ఇది 21వ శతాబ్దంలో మరింతగా పురోగమిస్తోంది. దీని ప్రభావం అన్ని రంగాలలో ఉన్నట్లే విద్యారంగంలో కూడా బాగా ఉంది. కోవిడ్-19 సందర్భంలో శాస్త్ర, సాంకేతిక రంగ ఫలాలు జనబాహుళ్యంలోకి మరింతగా చొచ్చుకొని పోతున్నాయి. సమాచారం అందించే, పొందే విధానంలో ఫోన్ కనుగొనడం ఒక మేలిమలుపు. ఈ ఫోనుకు అంతర్జాల సౌకర్యం ఉండేలా చేయడంతో ప్రపంచం, విశ్వం మానవుల గుప్పిట్లోకి వచ్చినట్లయింది.

మన దైనందిన జీవితం మొత్తం ఫోన్ తో ముడిపడి ఉంది. ప్రభుత్వపథకాలు, వ్యక్తిగత, కుటుంబ, సామాజిక పనులు, ఆర్థికాంశాల నిర్వహణ మొత్తం ప్రస్తుతం అంతర్జాల సౌకర్యంగల ఫోన్ పైనే ఆధారపడి ఉంది. బోధనారంగంలో అంతర్జాల సౌకర్యంగల ఫోన్ల వినియోగం ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ సౌకర్యాన్ని విద్యను బోధించేవారు, అభ్యసించేవారు వినియోగించుకొని ఎన్నో సత్ఫలితాలు పొందుతున్నారు. ఎన్నో సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రతికూలాంశాలు కూడా దాపురించాయి. ఈ రెండింటి ప్రభావాలను అంచనా వేసుకొని ఆయా ప్రభావాల ఫలితాలను విశ్లేషించుకొని ప్రతికూల అంశాలను నిరోధించేలా, వాటి పట్ల భద్రంగా, సురక్షితంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవడం ప్రస్తుతం తప్పనిసరి. ఈ అంశాలపై పెద్దవారి నుండి పిల్లల వరకు అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరముంది. సమాచారం, జ్ఞానం కళ్ళ ముందు ఒక్క క్లిక్ తో అందడం, ఇతరులకు అందించడం లాంటి సానుకూల అంశాలను సమర్థవంతంగా అందిపుచ్చుకోవాలి. ఆ దారిలో వచ్చే ప్రతికూలాంశాలను నిరోధించేలా తగు చర్యలు తీసుకోవాలి.

# యూనిట్-2: సురక్షిత అంతర్జాల వినియోగానికై పాటించాల్సిన నియమాలు

## అభ్యసన ఫలితాలు

1. సురక్షిత అంతర్జాల వినియోగానికై పాటించాల్సిన నియమాలను గుర్తిస్తారు.
2. సైబర్ నేరాలు, వేధింపులకు ప్రతిస్పందించే విధానాలను వివరిస్తారు.
3. అంతర్జాలాన్ని సురక్షితంగా, భద్రంగా దైనందిన జీవితంలో వినియోగిస్తారు.

## కీలక పదాలు

సైబర్ నేరాలు, శాస్త్ర-సాంకేతికత, సురక్షిత అంతర్జాల వినియోగం, ఆన్‌లైన్, సోషల్ మీడియా, పాస్‌వర్డ్.

## పరిచయం

మన దైనందిన జీవితంలో అంతర్జాలం పూర్తిగా ఒక భాగమైనప్పుడు, దానిని తప్పక వినియోగించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు కొన్ని నియమాలు పాటించాల్సిన అవసరం తప్పక ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో వచ్చిన ప్రతి మార్పు, దానితో పాటు కొన్ని నష్టాలను, కష్టాలను కూడా తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇది మానవ పరిణామ క్రమంలో కనుగొన్న ప్రతీ అంశానికీ వర్తించే అవకాశముంది. అయితే ఈ అంశాలు ప్రతికూలంగా మారడం అనేది శాస్త్ర, సాంకేతికతది కాదు - దానికి కనుగొనిన వారిది కాదు - ఆయా పరికరాలది కాదు. దీనికి ప్రధాన కారణం వాటిని ఉపయోగిస్తున్న వ్యక్తుల మనస్తత్వం. ఆ మనస్తత్వం గల వ్యక్తులు దుర్వినియోగం చేయడం జరుగుతున్నది. ఇది మొత్తం శాస్త్ర, సాంకేతిక రంగాలన్నింటిలో ఉంటున్నది. అంతర్జాల వినియోగానికి సంబంధించి కూడా వ్యక్తుల దుర్వినియోగానికి చాలా అవకాశాలున్నాయి. కాబట్టి అందరూ సురక్షిత అంతర్జాల వినియోగానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో చదివే కౌమార దశలోని పిల్లలు మరింత సురక్షితమైన, భద్రత విధానాలను పాటించవలసి ఉంది. ఈ విషయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, సన్నిహితులు దృష్టి పెట్టి ఉంచాలి. అవసరమైన జాగ్రత్తలు చెప్పాలి. సమస్యల వలయంలోకి వెళ్ళకుండా మార్గదర్శనం చేయాలి. విద్యార్థులు ఎక్కువగా అంతర్జాలాన్ని వినియోగించుకోవాల్సిన సంధర్భాలలో, విద్య కోసం ఎక్కువగా అంతర్జాలంపై ఆధారపడుతున్న స్థితిలో, దానిని నివారించడం అసాధ్యమైన పరిస్థితులలో సురక్షితమైన, భద్రమైన వినియోగంపై అవగాహన కల్పించడం, అది అమలు జరిగేలా చూడడం తప్పక చేయాలి.

## సైబర్ నేరాలు, వేధింపుల నుండి రక్షణ కొరకు ప్రతిస్పందించవలసిన కొన్ని విధానాలు

- కొత్త వ్యక్తుల నుండి వచ్చే కాల్స్ (calls) మరియు సందేశాలకు తప్పనిసరి అవసరం అనుకుంటేనే ప్రతిస్పందించాలి.

- పరిచయాలు పెంచుకొని వేధించే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వారికి ప్రతిస్పందించడం మానాలి. గట్టిగా 'No' చెప్పాలి.
- ఈ విషయాన్ని గురించి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు వెంటనే సమాచారం ఇవ్వాలి.
- అవసరం అనుకుంటే తప్పక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి.
- మొహమాటం, నలుగురికి తెలుస్తుందనే భయం లాంటివి వదలాలి.
- ముందుగా భద్రతాపరమైన అమరికల గురించి అవగాహన చేసుకొని వాటిని తప్పక ఉపయోగించాలి.
- ఇబ్బంది పెట్టే వారికి సంబంధించిన ఆధారాలను, ఇబ్బందికి గురిచేసిన అంశాలను తప్పక సేకరించి పెట్టుకోవాలి.
- ఆపద సమయంలో తక్షణ సహాయం అందించగలిగే వారి వివరాలు, వారి ఫోన్ నెంబర్లు తప్పక దగ్గర ఉంచుకోవాలి.
- ఎటువంటి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం ఇతరులకు చెప్పరాదు. ఫోటోలు, వీడియోలు షేర్ చేయరాదు.
- ఆన్లైన్లో పరిచయమైన వారి వివరాలు మీ కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు ఎప్పటికప్పుడు తెలపాలి.
- మీకు పరిచయమైన వారి వివరాలు అంటే నివాసం, వృత్తి, కుటుంబ సభ్యుల వివరాలు కూడా తెలుసుకోవాలి. అవి నిజమా, కాదో అనేది కూడా ధృవీకరించుకోవాలి.
- వ్యక్తిగత అంశాలకు సంబంధించి తప్పుడు సమాచారం ఇవ్వడం లేదా తప్పుడు చిత్రాలతో పరిచయం చేసుకునే విషయాన్ని పరిశీలించాలి.
- అనుకోకుండా జరిగే పరిచయాలే ప్రమాదాలకు కారణమవడం జరుగుతున్నదని గుర్తించాలి.
- సానుభూతి పొందేందుకు ప్రయత్నించి ఆ నెపంతో మీకు దగ్గరయ్యే ప్రయత్నాలను గుర్తించాలి.
- ముఖ్యంగా "భావోద్వేగాలను" గుర్తించి వాటి ఆధారంగా బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉంటుంది.
- మీరు ఉంటున్న స్థలం (location) వివరాలను అనవసరంగా ఎవరికీ షేర్ చేయరాదు.
- వయసుకు తగని వెబ్‌సైట్లు చూడరాదనే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి.
- సొంత ఫోన్ ను అపరిచితులకు, ఇతరులకు ఎటువంటి పరిస్థితులలో ఇవ్వరాదు. మీరు చూడని సమయంలో సెట్టింగులను మార్చడం, సమాచారం, నగదు వంటివి బదిలీ చేయడం చేయవచ్చును.
- దైనందిన జీవితంలో ఎవరికీ చెప్పని అంశాలు ఆన్‌లైన్లో కూడా ప్రస్తావించరాదు.
- పాస్ వర్డ్ లు ఎటువంటి పరిస్థితులలో ఎవరికీ చెప్పరాదు. ఒకవేళ ఇతరుల కంప్యూటర్, ఫోన్ లో మీ సమాచారానికి సంబంధించి ఏదైనా పని చేసుకున్నప్పుడు తప్పక 'logout' కావాలి.
- ఆన్‌లైన్‌లో స్నేహితులను ఒంటరిగా, వ్యక్తిగతంగా కలవరాదు.

పై విధానాలను విద్యార్థులు కూడా పాటించేటట్లు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అవగాహన కలిగించాలి.

## పిల్లలు ఆన్‌లైన్ పరిచయాల పట్ల ఆసక్తి చూపడానికి కారణాలు

- **సామాజిక ఒంటరితనం:** కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాల వాతావరణానికి దూరమై ఒంటరితనానికి గురయ్యే వారు ఆన్ లైన్ స్నేహాల ఎరలో చిక్కుకుంటున్నారు. కాబట్టి పిల్లలకు సమయమిచ్చి వారితో కొంత సమయం గడపడం, మాట్లాడటం తప్పక చేయాలి. పిల్లలు ఒంటరితనానికి గురికాకుండా చూడాలి. ఒకవేళ పిల్లలు ఆన్ లైన్ స్నేహాలకు బానిసలై ఉంటే వారు సామాజిక ఒంటరితనానికి గురైనట్లేనని గుర్తించాలి.
- **సమవయస్కుల ప్రభావం:** కౌమార దశలో తమ వయస్సు వారు, తమలాగే అలవాట్లు ఉన్నవారు, ఒకే అభిరుచి కలిగిన వారి పట్ల పిల్లలు తొందరగా ప్రభావానికి లోనవుతారు. ముఖ్యంగా భిన్న లింగ వర్గీయుల పట్ల మరింత ఆకర్షణకు లోనవుతారు. కాబట్టి పిల్లలకు ఈ అంశాలపై తప్పక అవగాహన కల్పించాలి. ఈ విషయాలు వారితో మాట్లాడాలి. సరైన అవగాహన కల్పించాలి.
- ఆసక్తి: కౌమారదశలో కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి చాలా ఉంటుంది. ఈ ఆసక్తి బాల్యదశలో ప్రారంభమై ఈ దశలో ఇంకా ఎక్కువవుతుంది. ఆ కుతూహలంతో చూడకూడని వెబ్‌సైట్లు చూడడం, కొత్త అంశాల పేరిట వచ్చే ప్రకటనలకు ఆకర్షింపబడడం జరుగుతుంది. బహుమతుల వంటి ప్రలోభాలకు లొంగకుండా చూడాలి. తమ విద్యకు, కెరీర్ కు, జీవితానికి సంబంధించిన వాటి పట్ల మాత్రమే ఆసక్తిని పెంపొందించుకునేలా మార్గదర్శనం చేయాలి. ఆసక్తిని సానుకూల అంశాలపై మరల్చేలా మార్గదర్శనం చేయాలి.
- **భావోద్వేగాలు:** ఈ వయస్సు పిల్లల్లో భావోద్వేగాలు ఎక్కువవడం-వాటిని ప్రదర్శించడం ఎక్కువగా జరుగుతుంటుంది. ఇది అంతస్రావ గ్రంథులు చురుకుగా ఉండి, అవి విడుదలచేసే హార్మోన్ల వల్ల జరుగుతుంది. ఆ విషయం వారికి అవగాహన కల్పించవలసి ఉంటుంది. కోపం, ఆవేశం, బాధ, సంతోషం, ఇష్టం వంటివి ఉచ్ఛస్థితిలో ప్రదర్శించే సందర్భాలు ఎక్కువగా ఉంటాయి. చుట్టుపక్కల వారితోపాటు ఆన్ లైన్ పరిచయాల పట్ల కూడా ఇదే రకమైన భావోద్వేగాలను వారు ప్రదర్శిస్తారు. కాబట్టి వాటిని నియంత్రించేలా చూడాలి.
- **విజయం కోసం గోప్యత:** ఈ దశలో పిల్లలు సాహసాలకు, గుర్తింపుకు, తమ ధైర్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తారు. తద్వారా కొన్నిసార్లు ఆపదలకు లోనవుతారు. సాహసోపేత పనులు చేయడానికి, పాల్గొనడానికి ఉత్సుకత చూపే తొందరలో మోసగాళ్ళ ఎరకు గురవుతారు. ఇలాంటి విషయాలు స్నేహితులకు మినహా కుటుంబ సభ్యులకు తెలియకుండా గోప్యత పాటిస్తారు. పిల్లల ఆసక్తులను ఎల్లప్పుడూ గమనించి మరియు వారితో ఆయా అంశాలు మాట్లాడి తల్లిదండ్రులు, టీచర్లు ఈ విషయంలో వారిని సరయిన మార్గంలో పయనించేలా సూచనలు చేయాలి. ఒక్కోసారి ఆన్‌లైన్ ఆటలకు బానిసలయ్యే అవకాశం ఉంది. ఎవరికీ చెప్పకుండా భౌతికంగా సాహసోపేత కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇవన్నీ పెద్దవారు గమనిస్తూ తగుమార్గంలో పయనించేలా చూడాలి.

## పిల్లలకు అవగాహన కలిగించే విధానం

తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల కంటే సమవయస్కులకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. కాని వారికి తప్పకుండా ఒక నమ్మకమైన పెద్దవారు మార్గదర్శనం చేయడానికి ఉండాలి. ఆ నమ్మకమైన వ్యక్తి వారికి అన్ని అంశాలలో మార్గదర్శనం సరైన విధానంలో చేయగలగాలి.

## నమ్మకమైన వ్యక్తి

ప్రతి కౌమారులకు ఒక నమ్మకమైన వ్యక్తి అంటూ ఉండాలి. వారు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, టీచర్లు, బంధువులలో ఎవరైనా అయి ఉండవచ్చును. వారు అన్ని విషయాలు నిస్సంకోచంగా చెప్పగలిగేలా ఆ నమ్మకమైన వ్యక్తులై ఉండాలి. వారు వారి సంతోషాన్ని పంచుకోవడానికి ఎందరినైనా కోరుకుంటారు. కాని వారి కష్టాలు, సమస్యలు, హృదయం విప్పి చెప్పుకునేలా ఒక నమ్మకమైన వ్యక్తి ఉండడం తప్పనిసరి.

## సరైన పదజాలం

బాలురు, బాలికలు ఇరువురికీ నమ్మకమైన వ్యక్తి ఉండాలి. వారు సరయిన పదజాలం ఉపయోగించి అన్ని అంశాలు వివరించగలగాలి. వారి శరీర నిర్మాణం, వాటిలో వచ్చే మార్పులు, హార్మోన్ల ప్రభావం, ప్రవర్తనల గురించి సరయిన పదజాలం వాడి వివరించాలి. పదజాలం సరిగ్గా వినియోగించకపోవడం వలన వారిలో తప్పుడు అవగాహన కలిగే అవకాశం ఉంది.

## సరైన అవగాహన

ప్రత్యుత్పత్తి అవయవాలు, వాటిలో మార్పులు, భిన్న లింగేయుల పట్ల కౌమారుల ప్రవర్తనతో పాటు వారి సాంఘిక సంబంధాలు, సాంకేతిక పరిచయాల వంటి విషయాలపై కౌమారులకు ఈ నమ్మకమైన వ్యక్తియే సరైన అవగాహన కల్పించగలగాలి. ఒక్కోసారి కుటుంబ సభ్యులు, నమ్మకమైన వ్యక్తులు తప్పుడు అవగాహనతో ఉంటే వారు కౌమారులకు సరైన మార్గదర్శనం చేయలేరు. ఈ తప్పుడు విధానాలకు భావితరాలు బలి అయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి నమ్మకమైన వ్యక్తి, సరైన పదజాలం వాడి సరైన అవగాహన కలిగించేలా చూడాలి.

## ప్రతి అంశానికి ప్రతిస్పందించరాదు

ఇతర వ్యక్తుల ప్రవర్తనకు, పరిసరాలలో జరిగే పరిణామాలకు అతిగా స్పందించరాదు. ముఖ్యంగా సోషల్ మీడియా, ఆన్లైన్ అంశాలకు భావోద్వేగానికి గురయ్యి స్పందించరాదు. అన్నింటిని ప్రశాంతంగా చూసి అవసరమున్న వాటిని స్వీకరించాలి. అనవసరమైన గ్రూపులలో సభ్యులుగా ఉండరాదు.

## వనరుల వినియోగంలో జాగ్రత్తలు - సమతుల్యత

ఫోన్, సోషల్ మీడియా, ఆన్లైన్ (online) స్నేహాలు ఇలా అన్నింటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వినియోగంలో, ప్రతిస్పందనలో, భాగస్వామ్యంలో..... ఇలా ప్రతీదాంట్లో సమతుల్యత అవసరం.

## స్వేచ్ఛ - సురక్షితం

ప్రతీ అంశంలో వెంట్రుక పరిమాణంలో ఉండే హద్దుగీతను గుర్తించగలగాలి. మన జీవన విధానంలో ప్రతీది అవసరమయినప్పటికీ వాటిలో అనుకూల, ప్రతికూలతలను గుర్తించాలి. స్వేచ్ఛ అవసరమే. కాని సురక్షితమైన, భద్రమైన అంశాలపై తప్పక దృష్టి ఉంచాలి. ఈ రెండింటి కలయికతో మన ప్రతిస్పందనలు ఉండాలి.

వారి జీవనం సరైన అవగాహన కల్పించడం వలన సరైన దారిలో మనుగడ సాధిస్తుంది. ముఖ్యంగా అంతర్జాల సౌకర్యం గల ఫోన్లు వినియోగించే వారికి, ఆన్‌లైన్‌లో గడిపే వారికి చాలా సమాచారం అందుబాటులో ఉండి వారిని తప్పుడు అవగాహనకు గురిచేయవచ్చు లేదా భిన్న అంశాలు ఉన్నప్పుడు వారు దేనిని ఎంచుకోవాలో అని తర్జన భర్జన పడవచ్చు. ఆ సందర్భంలో ఈ నమ్మకమైన వ్యక్తిగత మార్గదర్శనం వారికి ఎంతగానో తోడ్పడుతుంది. ఈ నవీన సాంకేతిక యుగంలో మనిషికి మనిషి తోడు నిలవాలి. కాని సాంకేతిక పరికరాలు కాదని గుర్తించాలి.

## లక్ష్యాలపై దృష్టి

ప్రతీ వ్యక్తి దీర్ఘకాల, స్వల్పకాల లక్ష్యాలు కలిగి ఉండి వాటి సాధనకు కృషి చేస్తూ ఉండాలి. అదేవిధంగా ముఖ్యంగా బాలలకు ఒక లక్ష్యాన్ని ఏర్పరచాలి. ఇది వారిని ఒక నిర్దిష్టమైన మార్గంలో వెళ్ళేలా చేస్తుంది. ఆ లక్ష్య సాధనలో ఎదురయ్యే ఆటంకాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడంతో పాటు లక్ష్యాన్ని దారితప్పించే అంశాలపై కూడా అవగాహన పెంపొందించాలి. సైబర్ నేరాలు చేయడానికి, నేరాలకు గురి కావడానికి లక్ష్యరహిత జీవన విధానం కూడా కారణమవుతున్నది. మన లక్ష్యాన్ని గుర్తించి దానికనుగుణంగా ప్రలోభాలకు గురిచేయడం కూడా జరగవచ్చును. కాబట్టి వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకోవాలి.

## నిజజీవిత పరిస్థితులపై అవగాహన

అసాధారణ అంశాలపై ప్రతిస్పందించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నేల విడిచి సాము చేయరాదు. నిజ జీవిత, దైనందిన పరిస్థితులలో సాధ్యం కాని, ఆశ్చర్యం, అద్భుతంగా గల వాటికి కౌమార దశలో ఆకర్షింపబడడం సాధారణమే. కాని వాటిని నియంత్రించుకొని ఆలోచించి - విశ్లేషించి నిర్ణయం తీసుకోవాలి. విద్యార్థులకు ఈ అంశాలన్నింటిలో సరయిన అవగాహన కల్పించడం అవసరం. అంతర్జాలం గల ఫోన్ వాడే సందర్భంలో విద్యార్థులు ఈ అంశాలన్నింటిని దృష్టిలో పెట్టుకునేలా అవగాహన కల్పించాలి.

## సంక్షిప్త సారాంశం

మానవ దైనందిన జీవనంలో ఫోన్, అంతర్జాల వినియోగం ఒక తప్పనిసరి భాగమయిన సందర్భాలలో వాటిని వినియోగించడంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. అందుకు తగిన నియమాలు రూపొందించుకొని వాటిని అమలుచేయాలి. ప్రతి ఆవిష్కరణ లాభాలతోపాటు కొన్ని ఇబ్బందులను తీసుకురావచ్చు. వాటిని భవిష్యత్ కాలంలో అధిగమించవచ్చును. కాని అప్పటి వరకు కొన్ని సురక్షిత, భద్రతా నియమాలు పాటించడం తప్పనిసరి. శాస్త్ర, సాంకేతిక రంగాల ఫలాలు దుర్వినియోగం అనేది వ్యక్తుల మనస్తత్వానికి సంబంధించిన అంశం. దానిని శాస్త్ర, సాంకేతిక రంగానికి అంటగట్టడం సబబుకాదు. ఆన్లైన్ సమస్యలకు కూడా భద్రతాపరమైన, సురక్షితమైన విధానాలున్నాయి. వాటిని అవగాహన కల్పించి పాటించేలా చూడాలి. ఇందుకు బాలలకు తల్లిదండ్రులు, టీచర్లు, బంధువులు సహకరించాలి.

సైబర్ నేరాలకు సంబంధించి పిల్లల భావోద్వేగాలు, ఆసక్తుల వంటివి కీలక పాత్ర పోషిస్తాయి. ఆకర్షణీయమైన బహుమతులు, ప్రకటనలు, భిన్న లింగేయుల పట్ల ఆసక్తి, తమ గుర్తింపు కోసం చేసే ప్రయత్నాలు వారిని చిక్కుల్లో పడవేసే అవకాశముంది. ఆన్‌లైన్లో పరిచయమైన వారికి వ్యక్తిగత వివరాలు, ఫోన్ నెంబర్లు ఇవ్వకపోవడం, పాస్‌వర్డ్, ఓ.టి.పి. వంటివి చెప్పకపోవడం, వ్యక్తిగతంగా కలవడం వంటివి చేయరాదనే అవగాహన కల్పించాలి. ఆన్ లైన్లో పరిచయమైన వారి వివరాలు తప్పకుండా ఇతర స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలి. పిల్లలు ఆన్లైన్ (online) పరిచయాలకు దగ్గర కావడానికి కారణం సామాజిక ఒంటరితనం, కుటుంబ సభ్యుల మధ్య సరైన అనుబంధం, ఆప్యాయతలు లేకపోవడం, సరైన లక్ష్యాలు నిర్దేశించుకోకపోవడం, తీవ్రమైన ఆసక్తులు కారణం. కాబట్టి పిల్లలకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, టీచర్లు, తగినంత సమయం కేటాయించి వారితో గడపడం, మాట్లాడడం, వారి లక్ష్యాల సాధనకు చేయూతనివ్వడం, వారి అభిప్రాయాలను గౌరవించడం, విభేదించినప్పుడు శాస్త్రీయంగా విశ్లేషించి నచ్చచెప్పడం చేయాలి.

అతి ముఖ్యమైన అంశం కౌమారులు ఒక నమ్మకమైన వ్యక్తి సాన్నిహిత్యం కలిగి ఉండటం. వారు సరైన పదజాలాన్ని ఉపయోగించి సరైన అవగాహన కలిగించినప్పుడు సైబర్ నేరాలతో పాటు ఇతర అన్ని సమస్యల నుండి వారిని దూరం చేయవచ్చు. ఈ నమ్మకమైన వ్యక్తి కుటుంబ సభ్యులు, టీచర్లు, పెద్దవారు ఎవరైనా కావచ్చును.

అంతర్జాలం వల్ల కలిగే లాభాలను పూర్తిగా వినియోగించుకొని, దాని నుండి కలిగే సమస్యలను సురక్షిత, భద్రతాపర అంశాల ద్వారా నివారించడం అనేది వారు కల్పించే అవగాహనపై ఆధారపడి ఉంటుంది.

# యూనిట్-3: సైబర్ నేరాల నుండి సురక్షిత, భద్రత - పాఠశాల పాత్ర

## అభ్యసన ఫలితాలు

1. సైబర్ నేరాలకు విద్యార్థులు గురికాకుండా చూడడంలో పాఠశాల పాత్రను వివరిస్తారు.
2. స్వీయరక్షణకు చేపట్టవలసిన అంశాలను గుర్తిస్తారు.
3. సైబర్ కాంగ్రెస్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు.
4. దైనందిన జీవనంలో సురక్షిత, భద్రత అంశాలను పాటిస్తారు.

## కీలక పదాలు

కోవిడ్-19, సోషల్ మీడియా, యాప్‌లు, జీవన నైపుణ్యాలు, హాబీలు, సైబర్ కాంగ్రెస్, స్వీయ రక్షణ

## పరిచయం

శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి ఫలాలు సామాన్యుల చేతికి అందుతున్న కాలమిది. ఇలాంటి పరిస్థితుల్లోనే 2019 సంవత్సరం చివరిలో వచ్చిన కోవిడ్-19 సంక్షోభం వ్యక్తులను ఒకరినొకరిని కొన్ని రోజుల పాటు వ్యక్తిగతంగా కలుసుకోలేని స్థితికి తెచ్చింది. ఈ అంశం అన్నింటిపై తీవ్ర ప్రభావం చూపినట్లే విద్యావ్యవస్థపై కూడా బలమైన ప్రభావం చూపింది. దాంతో అవసరార్థం అనుకున్న అంతర్జాల సహిత ఫోన్లు తప్పనిసరి స్థితికి వచ్చాయి. చాలా కాలం పాటు విద్యాసంస్థలలో భౌతిక తరగతులు నిర్వహించలేని స్థితిలో సోషల్ మీడియా, అంతర్జాలంతో పనిచేసే అనేక యాప్‌లు ఎంతో ఉపయోగకరంగా మారాయి. కోవిడ్-19 పరిస్థితుల్లో రాష్ట్రంలోని పాఠశాలలు తరగతి వారీగా విద్యార్థుల సమూహాలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగింది. జూమ్ యాప్ ద్వారా తరగతుల నిర్వహణ జరిగింది. T-SAT యాప్ చాలా మంది విద్యార్థులు డౌన్లోడ్ చేసుకున్నారు. పాఠ్యపుస్తకాలలో క్యు.ఆర్. కోడ్ ముద్రించడం జరిగింది. ఇవన్నీ భౌతిక తరగతులు నిర్వహించలేని పరిస్థితులలో విద్యార్థులకు పాఠ్యాంశాలు వివరించేందుకు ఎంతగానో దోహదపడ్డాయి, దోహదపడుతున్నాయి. అదేవిధంగా గూగుల్ ఫామ్స్, క్విజ్జర్ ల వంటి వాటి ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయిని అంచనా వేయడం జరిగింది. వీటన్నింటి కొరకు విద్యార్థులు అంతర్జాల సౌకర్యం గల ఫోన్ వాడడం అనివార్యమైంది. దీంతో తప్పనిసరిగా ప్రతి విద్యార్థి అంతర్జాల సౌకర్యం కలిగిన ఫోనును సమకూర్చుకునే ప్రయత్నాలు చేశారు. ఈ విధమైన సౌకర్యం గల ఫోన్లతో చాలా మంది విద్యార్థులు బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొన్నారు. ఇవి వారికి ఎంతగానో అభ్యసనంలో తోడ్పడినాయి. దాంతోపాటు కొన్ని సమస్యలు కూడా తెచ్చిపెట్టాయి. విద్యార్థులు అంతర్జాల సౌకర్యాన్ని దుర్వినియోగం చేయడం మరియు సాంకేతికత సహాయంతో వివిధ రంగాల, వివిధ వయస్సుల వ్యక్తులు భిన్న ఆకర్షణలతో మోసానికి గురికావడం కూడా జరుగుతున్నది. కాబట్టి ప్రతి విద్యార్థికి ఫోనును సరిగ్గా వినియోగించడంతో పాటు, సైబర్ నేరాల నుండి సురక్షితంగా, భద్రంగా ఎలా ఉండాలో కూడా తెలియజేయవలసిన అవసరం ఏర్పడింది. ఇందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, సామాజిక సంస్థలు - వాటిలో పనిచేసే సభ్యులతోపాటు పాఠశాలల పాత్ర కూడా ప్రముఖంగా ఉంది. పాఠశాల సమాజం యొక్క సూక్ష్మ రూపం. కాబట్టి సమాజంలోని అన్ని అంశాలు పాఠశాలలో ప్రతిబింబిస్తాయి.

సైబర్ నేరాల విషయంలో కూడా పాఠశాల తన వంతు పాత్ర పోషించవలసి ఉంది. పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం, అవసరమైన నియమాలు పాటించేటట్లు చేయడానికి అవసరమైన కృషి చేయాలి. దాంతోపాటు ఇతర సంస్థలతో కలిసి అవసరమైన కార్యాచరణ రూపొందించుకొని అమలు చేయవలసి ఉంది.

**సైబర్ నేరాల వేధింపులకు సంబంధించి చేయవలసిన అంశాలు:**

- **పిల్లల మాట వినాలి:** పిల్లలు ఏదైనా చెప్పడానికి వచ్చినప్పుడు వారి మాటలు వినాలి. వారు మీతో మాట్లాడడానికి సమయం కేటాయించాలి. మేము మీ మాటలు వింటున్నాం, పట్టించుకుంటున్నాం అని గుర్తించేలా చూడాలి. దాంతో వారు ఫోన్, సోషల్ మీడియా కంటే మీతో మాట్లాడడానికి సమయం కేటాయిస్తారు. ఈ అలవాటు పాఠశాలలో అలవడితే అది అన్ని చోట్లా కొనసాగుతుంది. ఈ అంశాలు ఇంటి పరిస్థితులకు కూడా వర్తిస్తాయి. పిల్లల మాటలను సానుకూల దృక్పథంతో వినాలి. ఏకపక్షంగా తీర్పులనిచ్చే విధంగా పెద్దల నిర్ణయాలు ఉండరాదు.
- **చిన్న అంశాలే అని నిర్లక్ష్యం చేయరాదు:** పిల్లలు తమ సమస్యలను, సంతోషాలను పెద్దలు, టీచర్లకు చెప్పడానికి వస్తే చిన్న అంశమే అని, పట్టించుకోవలసిన అంశం కాదని అనుకోరాదు. పిల్లలు తమ మాట పెద్దలు లేదా టీచర్లు వింటున్నారని అనుకుంటే ప్రతీ చిన్న అంశం కూడా చెప్పగలుగుతారు. ఒక్కోసారి మనం 'చిన్నదే' అనుకున్న అంశం ముందర 'పెద్ద సమస్య'గా పరిణమించవచ్చు. కాబట్టి ప్రతీదీ వినాలి. పెద్దలు తమను పట్టించుకుంటారని పిల్లలు భావించినపుడు మాత్రమే భయపడకుండా, సిగ్గుపడకుండా వారు ప్రతీదీ చెప్పగలుగుతారు. ఇది సైబర్ నేరాలకు సంబంధించిన విషయాలలో అత్యంత ముఖ్యమైన అంశం. ఈ అంశం కుటుంబ సభ్యులకూ వర్తిస్తుంది.
- **పాఠశాల-ఇల్లు మధ్య సత్సంబంధాలు ఉండాలి:** పిల్లలకు సంబంధించి ఏ సమస్య వచ్చినా దానిని పరిష్కరించే ప్రక్రియలో పాఠశాల మరియు ఇల్లు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలి. సమస్య ఇంట్లో తెలిసినా పాఠశాలకు, పాఠశాలలో తెలిసినా ఇంటికి సమాచారం ఇవ్వాలి. దీని ద్వారా సమస్య తొందరగా, సరిగ్గా పరిష్కరించడానికి వీలవుతుంది. ఇది సైబర్ నేరాలు, వేధింపుల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుంది.
- **స్నేహితులు, వారి కుటుంబ సభ్యులతో గల సాన్నిహిత్యాన్ని కూడా గమనించాలి:** లైంగిక వేధింపుల వంటివి మెజారిటీగా తెలిసినవారి నుండే జరుగుతున్నవి. కాబట్టి పిల్లల మిత్రులు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, వారు ఎప్పుడూ వెళ్ళే ప్రదేశాలు, ఆ దారుల వెంబడి గల వ్యక్తుల గురించి కూడా పిల్లలు జాగ్రత్త వహించేలా చూడాలి. కౌమార దశలో సమవయస్కుల ప్రభావం చాలా ఉంటుంది. కుటుంబ సభ్యులతో లోపించిన సాన్నిహిత్యం పూరించడానికి ఈ వయసులో పిల్లలు తాపత్రయపడడం కూడా అనేక నేరాలకు దారి తీస్తుంది. మీరు మరియు కుటుంబం ఎక్కువ సమయం పిల్లలకు కేటాయించనప్పుడు ఆ స్థానాన్ని ఫోన్, ఇతరులు ఆక్రమించడం సాధారణం. కాబట్టి పిల్లల ప్రపంచంలో ఎవరెవరున్నారో మీకు తెలిసి ఉండాలి. అది పాఠశాల అయినా, ఇల్లు అయినా...

- **పిల్లలకు జీవన నైపుణ్యాలు అభ్యాసం చేయించాలి:** పిల్లలు దేనినైనా సాధించాలంటే, సాధికారతతో జీవించాలంటే వారికి జీవన నైపుణ్యాలను పరిచయం చేయాలి. పాఠశాలలో తప్పకుండా జీవన నైపుణ్యాలను విద్యార్థులకు పరిచయం చేయాలి. పాఠశాలకు అందజేసిన అకడమిక్ క్యాలెండరులో కూడా జీవన నైపుణ్యాలకు వారానికి ఒక పీరియడ్ కేటాయించడం జరిగింది. వివిధ సబ్జెక్టులకు పీరియడ్లు కేటాయించినట్లే జీవన నైపుణ్యాలకు కేటాయించిన పీరియడ్లలో ఆ అంశాలు తప్పక నిర్వహించాలి. ఇందుకు తగిన సిలబస్, పాఠ్యాంశాలు కూడా రాష్ట్ర విద్యాశాఖ ప్రతి పాఠశాలకు అందజేయడం జరిగింది. ఈ అంశం మదింపు, మూల్యాంకనం చేయాలని కూడా నిర్దేశించడం జరిగింది. విద్యార్థుల ప్రగతిని నమోదు చేసే సంచయిత మరియు సంపూర్ణాభివృద్ధి ప్రగతి నివేదికలో ఈ అంశానికి సంబంధించి విద్యార్థుల ప్రగతిని కూడా నమోదు చేయవలసి ఉంది. కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన పది జీవన నైపుణ్యాలను విద్యార్థులలో పెంపొందింపజేయాలి. వీటి ద్వారా సైబర్ నేరాలు, వివిధ రకాల వేధింపులతో పాటు జీవితంలో, దైనందిన పరిస్థితులలో వ్యవహరించే విధానం వారికి బాగా తెలుస్తుంది. వారిలో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. వారు తమను తాము అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఇతరులకు సహాయం చేసేంతగా ఎదుగుతారు.
- **కొత్త నైపుణ్యాలు, అలవాట్లు పెంపొందించుకొనేలా ప్రోత్సహించాలి:** ప్రతి విద్యార్థిలో చాలా నైపుణ్యాలు ఉంటాయి. వీటిని పెంపొందించుకునేలా ప్రోత్సహించాలి. అదే విధంగా నూతన నైపుణ్యాలను పరిచయం చేయాలి. వాటిలో ప్రగతి సాధించేలా అభ్యాసం చేయించాలి. వీటన్నింటికి దినచర్యలో కొంత సమయం కేటాయించేలా ప్రోత్సహించాలి. ఆయా నైపుణ్యాలకు చెందిన ప్రముఖులను పరిశీలించేలా చూడాలి. చిత్రలేఖనం, ఒరిగామి, నమూనాల తయారీ, పజిళ్ళను పరిష్కరించడం, సైక్లింగ్, ఇష్టమైన ఆటలు ఆడేలా ప్రోత్సహించాలి. అదేవిధంగా 'హాబీ'లు పెంపొందించుకునేలా చూడాలి. పుస్తకాలు, స్టాంపులు, నాణేల సేకరణ వంటి ఏదో ఒక అలవాటును ప్రోత్సహించాలి. వీటన్నింటి ద్వారా విద్యార్థులు లక్ష్యాత్మకంగా దినచర్య గడుపుతారు. లక్ష్యాత్మకం కాని దినచర్యలో ఫోనును దుర్వినియోగం చేసే అవకాశముంది. ఫోన్ ద్వారా కూడా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, అభివృద్ధి చేసుకోవడం చేయవచ్చు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలి. తెలంగాణకు చెందిన ఒక విద్యార్థి వీడియో గేమ్స్ చూస్తూ వాటిని తయారుచేసే విధానానికి సంబంధించిన పోటీలలో నెగ్గి అంతర్జాతీయ పాఠశాలలో ప్రవేశం పొందాడు. ఇలాంటి వాటిని తల్లిదండ్రులు, టీచర్లు ప్రోత్సహించాలి.
- **స్వీయ రక్షణను నేర్పించాలి:** పిల్లలు శారీరకంగా దృఢంగా ఉండేటట్లు, మానసికంగా పరిస్థితులను ఎదుర్కొనేట్లుగా స్వీయ రక్షణను నేర్పించాలి. శారీరక దృఢత్వం కోసం పౌష్టికాహారం, వ్యాయామాలు, స్వీయ రక్షణ కొరకు కరాటే వంటివి నేర్పించాలి. ఆపద సమయాలలో చిన్న ప్రయత్నాల ద్వారా రక్షణ పొందేలా కొన్ని 'చిట్కాలు' అభ్యాసం చేయించాలి. పాఠశాలలో వ్యాయామ విద్య సమయంలో ఈ అంశాలను వివరించాలి. సైబర్ నేరాలు మానసిక ఒత్తిడిని బాగా కలిగిస్తాయి. వాటిని ఎదుర్కొనే మానసిక దృఢత్వాన్ని విద్యార్థులలో పెంపొందించాలి.

- **సమర్థవంతంగా సైబర్ కాంగ్రెస్ కార్యక్రమాల అమలు:** 2021-22 విద్యా సంవత్సరంలో ప్రారంభించిన సైబర్ కాంగ్రెస్ కార్యక్రమాలను తప్పనిసరిగా పాఠశాలల్లో ప్రభావవంతంగా అమలుచేయాలి. ఇందుకోసం రాష్ట్రంలో ఎన్నిక చేసిన పాఠశాలలతో పాటు, అన్ని పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో కూడా ఈ కార్యక్రమాన్ని అమలుచేయాలి. షీ టీమ్స్ (She Teams) సభ్యులతో రెగ్యులర్‌గా మాట్లాడించాలి. అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్న ఇద్దరు బాలికలకు అన్ని అంశాలను వివరంగా అవగాహన కల్పించి, వారి ద్వారా పాఠశాలలోని విద్యార్థులందరికి అంశాలను వివరింపజేయాలి. పాఠశాల నాయకులు, పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని మార్గదర్శనం చేస్తున్న టీచర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా చూడాలి. సైబర్ నేరాల నిర్మూలనకు ఫోన్ సద్వినియోగానికి ఈ కార్యక్రమం ఎంతగానో సహాయపడుతుంది. దీని ద్వారా విద్యాసంస్థలతో పాటు వారి తల్లిదండ్రులు, సమాజం కూడా చైతన్యమవుతుంది. అదే విధంగా సైబర్ నేరాలకు సంబంధించి కంప్లయింట్ చేసే విధానం, ఆయా నేరాలకు గల శిక్షలు, ఐ.టి. చట్టం వంటివాటి గురించి కూడా అవగాహన కల్పించాలి. స్థానిక పోలీస్ స్టేషనుతో పాటు ఆన్‌లైన్‌లో కూడా కంప్లైంట్ చేయడంపై అవగాహన కల్పించాలి.

## పాఠశాలలో తప్పకుండా ప్రదర్శించాల్సిన అంశాలు

| | | |
|---|---|---|
| చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరు | : | 1098 |
| చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరు | : | 1800 425 3525; 1800 425 8696 |
| పోలీస్ | : | 100 |
| మహిళా రక్షణ | : | 040-27852246; 1091 |
| అంబులెన్స్ | : | 108 |
| షీ టీమ్స్ సభ్యురాలి పేరు, ఫోన్ నెంబర్ | : | |
| స్థానిక పోలీస్ స్టేషన్ నెంబర్ | : | |

**అంతర్జాల వినియోగానికి సంబంధించి విద్యార్థులకు తెలియవలసిన సురక్షిత భద్రత అంశాలు:**

**ఆగండి**

- వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు
- పాస్‌వర్డ్ చెప్పవద్దు
- ఒ.టి.పి. వివరాలు చెప్పవద్దు
- మీ కుటుంబ వివరాలు చెప్పవద్దు

**జాగ్రత్త**

- కంప్యూటర్ ఉపయోగించే ముందు మీ పెద్దవారికి చెప్పండి
- సైబర్ వేధింపులకు గురయితే వెంటనే పెద్దవారికి చెప్పండి.
- భద్రతా సెట్టింగులను తప్పక ఉపయోగించండి.
- సురక్షితంగా ప్రతిసారి logout కండి.
- ఇతరుల ఫోన్, కంప్యూటర్ వాడినప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోండి.

  (మీ ఫైల్స్ తీసివేయడం, logout కావడం)

**వాడండి**

- అంతర్జాలాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించండి.
- మర్యాదగా వ్యవహరించండి.
- ఎవరినీ నొప్పించకండి.
- అనవసర అంశాలను షేర్ చేయకండి

**సురక్షితంగా సోషల్ మీడియాను ఉపయోగించే విధానం:**

- అందరినీ గౌరవించేదిగా ఉండాలి.
- ఇతరులకు కోపం, ఆవేదన, ఇబ్బంది వంటివి కలిగించరాదు.
- పరిచయం లేని వారి నుండి వచ్చే సమాచారాన్ని పట్టించుకోవద్దు-ప్రతిస్పందించవద్దు.
- ఇబ్బంది పెట్టే సమాచారం పంపేవారిని బ్లాక్ చేయండి. బ్లాక్ చేసే విధానం తప్పకుండా తెలుసుకోవాలి.
- పైరసీ సాఫ్టువేర్ ను వాడవద్దు. కొనుగోలు చేసిన సాఫ్టువేర్ లేకపోతే, ఓపెన్ సోర్స్ సాఫ్టువేర్ ను ఉపయోగించుకోవాలి.
- సమాచారం తొలగించినను ఏదో ఒక దగ్గర నిక్షిప్తమై ఉంటాయని గుర్తుంచుకోవాలి.
- పరిచయం లేని వారికి మీ ఫోన్ నెంబరు, మెయిల్ అడ్రస్, ఇతర వివరాలు ఇవ్వరాదు,
- నివాస స్థలం, బ్యాంకు ఖాతా వంటి వివరాలు అపరిచితులకు చెప్పడం, పంపడం చేయరాదు.
- వివిధ భంగిమలలో ఉన్న సొంత ఫోటోలు, కుటుంబ సభ్యుల ఫోటోలు ఎవరికీ పంపరాదు.
- స్నేహితుల వివరాలు, ఫోటోలు, ఫోన్ నెంబర్లు వంటివి వారి అనుమతి లేనిదే ఇతరులకు సమాచారం ఇవ్వరాదు.
- అపరిచితులు తప్పుడు సమాచారం, వివరాలు, ఫోటోలను ఉపయోగించి మోసం చేయవచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.
- ఆన్లైన్ తరగతుల సమయంలో అసలు పేరును మాత్రమే ఉపయోగించాలి. తరగతుల ప్రారంభంలో వీడియోలో వారి ముఖం చూసి నిర్ధారించుకోవాలి.
- వ్యక్తిగతంగా ఒంటరిగా ఆన్‌లైన్ స్నేహితులను కలవడానికి వెళ్ళవద్దు.
- తెలియని లేదా తప్పుడు సమాచారాన్ని ట్రోల్ చేయవద్దు. ఇతరులను ఇబ్బందిపెట్టే, నిర్ధారించుకోకుండా ఏ సమాచారాన్ని ఇతరులకు షేర్ చేయవద్దు.
- సోషల్ మీడియాలో పరిచయమైన వారి వివరాలను మీ స్నేహితులు, కుటుంబసభ్యులకు తప్పక చెప్పాలి.

**అంతర్జాలాన్ని ఉపయోగించేటప్పుడు పాటించాల్సిన అంశాలు:**

**THINK - అంశాలను పాటించాలి.**

- **T (True)** - సమాచారం నిజమైనదా/ సరైనదా
- **H (Helpful)** - సమాచారం ఉపయోగకరమైనదా
- **I (Inspirational)** - సమాచారం స్ఫూర్తిదాయకమైనదా
- **N (Necessary)** - సమాచారం తప్పనిసరిదా/ అవసరమైనదా
- **K (Kind)** - సమాచారం ఇతరులను నొప్పించనిదా/ దయతో కూడినదా
- బలమైన పాస్వర్డును ఏర్పాటు చేసుకోవాలి. ఇది ఎవ్వరికీ చెప్పరాదు.
- పాస్వర్డులో capital letters, small letters, అంకెలు, గుర్తులు తప్పకుండా ఉండేలా చూసుకోవాలి.
- ఇవన్నీ కలిపి కనీసం 12 అక్షరాలు ఉండాలి.
- ఒకే పాస్వర్డ్ అన్నింటికి ఉపయోగించవద్దు. పాస్వర్డును తరచుగా మారుస్తూ ఉండాలి.
- తెలియని యాప్ లను డౌన్లోడ్ చేసుకోవద్దు. వాడవద్దు.
- ఆంటివైరస్ సాఫ్ట్వేర్ ను ఫోన్లో ఇన్స్టాల్ చేసుకోవాలి.
- తప్పుడు ఆంటివైరస్ సాఫ్ట్వేర్ ల పట్ల జాగ్రత్త వహించాలి.
- ఫోన్లో Avast మరియు McAfee యాంటివైరస్ లను వాడవచ్చు.
- CSK.Gov.in లో ఫోన్లకు సంబంధించిన ఉచిత యాంటివైరస్ లభిస్తుంది.
- వేధింపులు, సమస్యలు ఉంటే హెల్ప్లైన్ కు ఫోన్ చేసి చెప్పాలి.
- ఈ విషయంలో సురక్షిత – భద్రత కొరకు చేయవలసింది/ బ్లాక్ చేయడం – నమ్మకమైన వ్యక్తికి చెప్పడం – మహిళా హెల్ప్లైనుకు ఫోన్ చేయడం – పోలీసులకు ఫిర్యాదు చేయడం – షీ టీములను సంప్రదించడం – అవసరమైన వ్యక్తుల, సంస్థల సహాయం తీసుకోవడం.

**ప్రస్తుతం ఎక్కువగా మోసాలు జరుగుతున్న విభాగాలు:**

- వివాహ ప్రకటనలు, పెండ్లిళ్ళకు సంబంధించి వధూవరుల సమాచారానికి చెందిన వివాహ వెబ్సైట్లు.
- ఉద్యోగ ప్రకటనలు
- ఇంటి వద్ద నుండే పని చేయవచ్చనే ప్రకటనలు
- OLX అమ్మకపు ప్రకటనలు
- డిస్కౌంటు అమ్మకాల ప్రకటనలు
- లాటరీలు
- అప్పు మంజూరు చేయడం
- స్కాలర్షిప్ అందించే ప్రకటనలు
- బ్యాంకుల పేరిట లింక్స్ పంపడం

## సంక్షిప్త సారాంశం

పాఠశాల సమాజం యొక్క సూక్ష్మ రూపం. సమాజంలోని అన్ని అంశాలు పాఠశాలలో ప్రతిబింబిస్తాయి. సైబర్ నేరాలు సమాజంలో జరుగుతున్నప్పుడు అవి విద్యా సంబంధ అంశాలలో కూడా జరిగే అవకాశం ఉంటుంది. సమాజాన్ని మార్గదర్శనం చేసే సంస్థలలో పాఠశాల ఒకటి. విద్యార్థులకు మార్గదర్శనం చేసే సంస్థలలో కుటుంబం, సమాజంతో పాటు పాఠశాల ఒకటి. తమ పిల్లలకు సరైన మార్గదర్శనం చేయలేనటువంటి నిరక్షరాస్య కుటుంబాలు గల మన దేశ పరిస్థితులలో పాఠశాల ఈ బాధ్యతను తప్పక స్వీకరించాలి.

పాఠశాల వాతావరణం శిశుకేంద్రీకృతంగా, స్వేచ్ఛగా అభిప్రాయాలు వెలిబుచ్చేలా, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించినప్పుడు పిల్లలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఉంటుంది. పిల్లల మాటలు తప్పక పాఠశాల వినాలి. వారి అభిప్రాయానికి చోటిచ్చి వారిని తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలి. చదువు ఫలాలు మార్కుల ప్రాతిపదికన కాకుండా పిల్లల సమగ్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలి. వ్యక్తిగత సమస్యలు ఆలకించి తగిన సూచనలు ఇవ్వాలి. లైంగిక వేధింపులు, సైబర్ నేరాలకు గురైన బాలలు తమ మాట వినేవారి కోసం చూస్తూ ఉంటారు. అందుకు పాఠశాల, టీచర్లు మొదటి ఆలంబన కావాలి.

విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించాలి. సైబర్ కాంగ్రెస్ నిర్వహణ తప్పక జరగాలి. పాఠశాలలో చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు తప్పక ప్రదర్శించాలి. ప్రతి విద్యార్థి జ్ఞాపకం ఉంచుకునేలా అభ్యాసం చేయించాలి. అంతర్జాల సౌకర్యంగల ఫోన్, సోషల్ మీడియాను సురక్షితంగా వాడేలా తగు అవగాహన కల్పించాలి. సురక్షితంగా, భద్రంగా అంతర్జాలాన్ని వినియోగించుకునేలా అవసరమైన మార్గదర్శనం పాఠశాల చేయాలి.

## మదింపు

1. **కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.**
   ఎ) సైబర్ నేరాలు వ్యక్తుల మనస్తత్వంపై ఆధారపడి జరుగుతాయి.
   బి) సైబర్ నేరాలకు కారణం శాస్త్ర, సాంకేతిక రంగాలు
   సి) అంతర్జాలం గల ఫోన్ వల్ల సైబర్ నేరాలు జరిగే అవకాశముంది. కాబట్టి అలాంటి ఫోన్ వాడరాదు.
   డి) అంతర్జాలం గల ఫోన్ బాలలకు ఎటువంటి పరస్థితులలో అందుబాటులో ఉంచరాదు.

2. **కింది వాటిలో తప్పు వాక్యాన్ని గుర్తించండి.**
   ఎ) లైంగిక వేధింపులకు ప్రధాన కారణం అంతర్జాలం గల ఫోన్ విద్యార్థుల దగ్గర ఉండడం.
   బి) అంతర్జాలం గల ఫోన్ లోని సురక్షిత, భద్రత అంశాలను తప్పక వినియోగించుకోవాలి.
   సి) భౌతిక తరగతులకు అవకాశం లేనప్పుడు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ వలన విద్యార్థులకు మేలు జరుగుతుంది.
   డి) ఫోన్ వాడకం వల్ల ప్రతికూల అంశాలు ఉన్నాయి.

3. **సమస్యలు ఎదురైనప్పుడు ఫోన్ చేయవలసిన హెల్ప్ లైన్ నెంబరు**

   ఎ) 1098

   బి) 1800 425 35 25

   సి) 108

   డి) ఎ మరియు బి

4. **కింది వాటిలో 'THINK' పేటిని ప్రతిబింబిస్తుంది.**

   A) Transparency, Hide, Inspect, Need, Knowledge
   B) True, Helpful, Inspirational, Necessary, Kind
   C) True, Hide, Inspirational, Need, Knowledge
   D) Transparency, Hint, Inner, Need, Knowing

5. **పాస్‌వర్డ్ (password) ను ఎంచుకునే విధానం**

   ఎ) పుట్టిన రోజును ఎన్నుకోవాలి.

   బి) సులభంగా జ్ఞప్తికి తెచ్చుకోనేలా ఉండాలి.

   సి) ఒక క్రమంలో ఉండే దానిని ఎంచుకోవాలి.

   డి) 12 లక్షణాలు కలిగి భిన్న గుర్తులతో ఉండాలి.

6. **లైంగిక వేధింపులు, సైబర్ నేరాల విషయంలో పిల్లలకు తప్పనిసరిగా తోడుండవలసిన వ్యక్తి**

   ఎ) తండ్రి

   బి) టీచర్

   సి) ఎవరైనా వయస్సులో పెద్ద మరియు నమ్మకమైన వ్యక్తి

   డి) స్నేహితులు

7. **కింది వాటిలో చేయదగని అంశం**

   ఎ) ఒక సాహసం చేసి విజయంతో అందరినీ ఆశ్చర్యపరచడానికి గోప్యత పాటించడం

   బి) ఆన్‌లైన్ పరిచయాలను కుటుంబ సభ్యులకు చెప్పడం

   సి) వ్యక్తిగత వివరాలను కొత్త వ్యక్తులకు ఇవ్వకపోవడం

   డి) ఒ.టి.పి. ఇతరులతో పంచుకోకపోవడం.

## రిఫరెన్సులు


1. Safe School Programme, SCERT, Telangana.
2. NISHTHA, NCERT, New Delhi.
3. IT Act, 2000.